వంద రోజులు పని దినాలు కల్పించాలి

ప్రజాశక్తి- హుకుంపేట:మండలంలో జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికి వంద రోజులు పని దినాలు కల్పించాలని ఎంజి ఎన్ఆర్ఐ జె సి ఏపిఓ లింగమూర్తి పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలో వీఆర్పీలు, మేట్లతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పని దినాలు అయిపోయిన వారికి పనులు కల్పించడం, కొత్త పేర్లు నమోదు, చనిపోయిన వారిని తొలగించడం వంటి పనులు వేగవంతం చేయాలన్నారు. ఉపాధి పని చేస్తున్నప్పుడు పర్యవేక్షణ చేయాలని సూచించారు. బకాయిలు చెల్లించాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వీఆర్పీలు, సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎపిఒ

ఇక సమరమే...!

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బరిలో 10 మంది
- పోటీ ఆ ముగ్గురు మధ్యే...
- పిడిఎఫ్ అభ్యర్థిగా కోరెడ్ల విజయగౌరి

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఉత్తరాంధ్ర పరిధిలోని విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం జిల్లాలకు సంబంధించిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోటీకోసం అభ్యర్థులకు నామినేషన్ల ఉపసంహరణ ఘట్టం గురువారం సాయంత్రంతో ముగిసింది. నామినేషన్లను దాఖలు చేసిన వారిలో ఏ ఒక్కరూ ఉపసంహరించుకోకపోవడంతో బరిలో 10 మంది అభ్యర్థులు నిలిచారు. ఐతే ప్రధాన పోటీ మాత్రం ముగ్గురు అభ్యర్థుల మధ్యే ఉంటుందని ఊహాగానాలు సాగుతున్నాయి. ఫిబ్రవరి 3 నుంచి 10వ తేదీ వరకూ నామినేషన్ల దాఖలు కార్యక్రమం విశాఖ జిల్లా కలెక్టరేట్ కేంద్రంగా జరిగింది. టీచర్ ఎమ్మెల్సీ బరిలో ఉన్న అభ్యర్థుల కోసం ఈనెల 27న ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకూ పోలింగ్ జరుగనుంది. 22,493 మంది టీచరు ఓటర్లున్నారు.

పోటీ ఆ ముగ్గురి మధ్యే...

యుటిఎఫ్ అభ్యర్థిగా ప్రోగ్రెసివ్ డెమక్రటిక్ ఫ్రంట్ (పిడిఎఫ్) బలపరచిన కోరెడ్ల విజయగౌరి ఉత్తరాంధ్ర ప్రాంతంలో పలు ప్రజాతంత్ర, ఉపాధ్యాయుల సమస్యలపైనా ఉద్యమాలు చేపట్టిన మహిళగా అందరిలోనూ మంచి గుర్తింపు పొందారు. ప్రభుత్వ, ప్రయివేటు స్కూల్స్‌లో సమస్యల అధ్యయనం, ప్రభుత్వాల విధానాల వల్ల విద్యారంగానికి జరగబోయే కష్ట, నష్టాలపై పలుమార్లు ఉత్తరాంధ్ర స్థాయిలో గొంతెత్తిన చరిత్ర ఆమెకు ఉంది. రాష్ట్రంలోనే పిడిఎఫ్ అభ్యర్థులందరూ ఉద్యమాభిలాషతో ముందుకు సాగిన వారే అయినందున టీచర్ల నుంచి ఈమెకు మంచి స్పందన లభిస్తోంది. ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీ బరిలో పాకలపాటి రఘువర్మ, గాదె శ్రీనివాసులనాయుడు శాసన మండలి సభల్లో ఉపాధ్యాయుల తరపున గొంతెత్తాల్సిన వీరు పాలక పక్షాలకు భజన చేస్తూ 'ఇద్దరూ ఇద్దరే' అనేలా వ్యవహరించడం టీచర్లందరిలోనూ తాజాగా చర్చ సాగుతోంది. ప్రస్తుత ఎన్నికల్లో 'కూటమి పార్టీల మద్దతు నాకంటే నాకు అనుకుంటూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీని సైతం వీరు రాజకీయం చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇలా పోటీ పడి ఏ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే వారికి వత్తాసుగా నిలవడమే వ్యాపకంగా మారిపోయింది. జాతీయ విద్యావిధానం పేరుతో ఢిల్లీ నుంచి రాష్ట్రాల విద్యాహక్కులను, విద్యారంగాన్ని కార్పొరేటీకరణ చేస్తున్న బిజెపికి చెందిన విశాఖ నాయకుడు పివిఎన్.మాధవ్ ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గాదె శ్రీనివాసులునాయుడుకు మద్దతుగా నిలబడ్డారు. ఆంధ్రప్రదేశ్‌లో మోడీ విధానాల అడుగులకు మడుగులొత్తుతూ విద్యా వ్యవస్థను కలుషితం చేసేందుకు సిద్ధమైన టిడిపి తరపున పట్టభద్రుల ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు రఘువర్మకు మద్దతుగా నిలిచారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీల ఉద్యమ స్ఫూర్తితో కోరెడ్ల విజయగౌరి ముందుకు సాగుతున్నారు.

విజయగౌరిని గెలిపించండి

ప్రజాశక్తి-అరకులోయ రూరల్:ఉత్తరాంధ్ర టీచర్స్ ఎమ్మెల్సీ పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి ఉమామహేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. గురువారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గురుకులాలు, రవ్వలగూడ టిడబ్ల్యూ పాఠశాల, డిగ్రీ ఉమెన్స్ కాలేజ్, హైస్కూల్‌లో కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ,గతంలో పీడీఎఫ్ ఎమ్మెల్సీలు ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎనలేని కృషి చేశారన్నారు. ఉద్యోగులు, ప్రజా సంఘాలు నిర్వహించే అనేక ఉద్యమాల్లో ప్రత్యక్ష పోరాటంలో భాగస్వాములు అయ్యారని తెలిపారు. అప్రెంటిస్ విధానం రద్దు, నోషనల్ ఇంక్రిమెంట్లు, ఎయిడెడ్ టీచర్లకు జీతాలు, కేజీబీవీ, రెసిడెన్షియల్ పాఠశాల టీచర్ సమస్యలపై పిడిఎఫ్ ఎమ్మెల్సీలు గళమెత్తి విజయం సాధించారన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు కె.రామారావు, సిఐటియు నాయకులు కొర్ర మగ్గన్న పాల్గొన్నారు.

ప్రచారం చేస్తున్న సిఐటియు నాయకులు

గోదావరి ఎన్నికల బరిలో...

35మంది అభ్యర్థులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికల ప్రచార సమరం ఊపందుకోనుంది. ఫిబ్రవరి మూడో తేదీన ప్రారంభమైన నామినేషన్ల పర్వం గురువారం విత్‌డ్రాల పర్వంతో ముగిసింది. మొత్తం 54 మంది నామినేషన్లు దాఖలు చేయగా 11 నామినేషన్లు పరిశీలనలో తిరస్కరణకు గురయ్యాయి. ఇక మిగిలిన 43 నామినేషన్లలో విత్‌డ్రాకు ఆఖరిరోజైన గురువారం ఎనిమిది మంది అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. దీంతో ఎన్నికల బరిలో 35 మంది అభ్యర్థులు మిగిలారు. పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితా లెక్క తేలిపోవడంతో ఇక నుంచి ఎన్నికల ప్రచారం మరింత ఊపందుకోనుంది. నామినేషన్లు దాఖలు చేసిన అభ్యర్థుల్లో గురువారం ఎనిమిది మంది అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారని, 35 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారికంగా ప్రకటించారు. ఈ నెల 27న పోలింగ్ జరగనుంది. అందుకు సంబంధించి అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఎన్నికల్లో మొత్తం 3,14,984 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఉమ్మడి పశ్చిమ, తూర్పుగోదావరి జిల్లాల్లో మొత్తం 113 మండలాల్లో ఈ ఎన్నికలు జరగనుండగా ఓటర్లు తమ ఓటుహక్కు వినియోగించుకునేందుకు 440 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. ఈ ఎన్నికల్లో మొత్తం పురుష ఓటర్లు 1,83,347 మంది ఉండగా, మహిళా ఓటర్లు 1,31,618 మంది, ట్రాన్స్‌జెండర్ ఓటర్లు 19 మంది ఉన్నారు.

ఓటర్ల ఫోన్ నెంబర్లు అధికార పార్టీ అభ్యర్థి చేతిలోకి

ఈ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థి డి.వి.రాఘవులు, టిడిపి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం నువ్వానేనా అన్నట్లు పోటీ పడుతున్నారు. అధికార పార్టీ అభ్యర్థి రాజశేఖరం గెలుపు కోసం కూటమికి చెందిన మంత్రులు, ఎంఎల్ఎలు, ఎంపీలతోపాటు కూటమి పార్టీలైన జనసేన, బిజెపి నేతలు పని చేస్తున్నారు. ఉద్యోగ, కార్మికులతోపాటు పలు ప్రజాసంఘాలు, పట్టభద్రులు పిడిఎఫ్ అభ్యర్థి డి.వి.రాఘవులు తరపున ప్రచారం చేస్తున్నారు. తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల్లోని పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో దాదాపు 3.14 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. ఓటర్లకు సంబంధించిన ఫోన్ నెంబర్లు మొత్తం అధికార పార్టీ అభ్యర్థి చేతిలోకి ఎలా వచ్చాయనే ప్రశ్న అందరినీ తొలిచేస్తోంది. నిబంధనల ప్రకారం ఓటర్ల జాబితాలో పేర్లు తప్ప ఫోన్ నెంబర్లు ఉండవు. ఎన్నికల నిబంధనల ప్రకారం ఓటర్ల ఫోన్ నెంబర్లు ఎవరికీ ఇవ్వకూడదని అధికారులు చెబుతున్నారు. మరి ఫోన్ నెంబర్లు అధికార పార్టీ నాయకుల చేతుల్లోకి ఎలా వెళ్లాయో అధికారులు, ఎన్నికల సంఘం చెప్పాల్సి ఉంది. ఫోన్ నెంబర్లు తీసుకున్న అధికార పార్టీ అభ్యర్థి తన వాయిస్ సందేశాలను ఓటర్లకు పంపిస్తూ తనకు ఓటేయాలని కోరుతున్నారు. ఓటర్ల ఫోన్ నెంబర్లు అభ్యర్థులకు ఇవ్వొచ్చు అనే నిబంధన ఉంటే బరిలో నిలిచిన మిగిలిన అభ్యర్థులందరికీ ఓటర్ల ఫోన్ నెంబర్లు ఇవ్వాల్సి ఉంటుంది. అలాకాకుండా అధికార పార్టీ అభ్యర్థికి మాత్రమే ఓటర్ల ఫోన్ నెంబర్లు వెళ్లడం సర్వత్రా చర్చనీయాంశమైంది. దీనిపై అధికారులు సమాధానం చెప్పాలనే డిమాండ్ పెద్దఎత్తున వినిపిస్తోంది. ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు సైతం ఈ ఫోన్ నెంబర్లను ఉపయోగించుకునే పరిస్థితి ఉంది. ఓటర్ల ఫోన్ నెంబర్లు అధికార పార్టీ అభ్యర్థికి వెళ్లడంపై ఎన్నికల అధికారులు స్పష్టత ఇవ్వాల్సి ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

పోటీలో ఉన్న అభ్యర్థులు వీరే

1.పేరాబత్తుల రాజశేఖరం (తెలుగుదేశం)
2.కాట్రు నాగబాబు (తెలుగు నవగర్జన)
3.షేక్ హుస్సేన్ (రిఫార్మ్ పార్టీ ఆఫ్ ఇండియా)
4.కట్టా వేణుగోపాలకృష్ణ (స్వతంత్ర అభ్యర్థి)
5.కాండ్రేగుల నరసింహం (స్వతంత్ర అభ్యర్థి)
6.కాళ్లూరి కృష్ణమోహన్ (స్వతంత్ర అభ్యర్థి)
7.కుక్కల గోవిందరాజు (స్వతంత్ర అభ్యర్థి)
8.కునుకు హేమాకుమారి (స్వతంత్ర అభ్యర్థి)
9.కైలా లావణ్య (స్వతంత్ర అభ్యర్థి)
10.గౌతంబాబు కొల్లు (స్వతంత్ర అభ్యర్థి)
11.చిక్కాల దుర్గారావు (స్వతంత్ర అభ్యర్థి)
12.తాళ్లూరి రమేష్ (స్వతంత్ర అభ్యర్థి)
13.దత్తాత్రేయ నోరి (స్వతంత్ర అభ్యర్థి)
14.దిడ్ల వీర రాఘవులు (డివి.రాఘవులు) (పిడిఎఫ్ అభ్యర్థి)
15.దొరబాబు యాళ్ల (స్వతంత్ర అభ్యర్థి)
16.నీతిపూడి సత్యనారాయణ (స్వతంత్ర అభ్యర్థి)
17.పినిపే నాగభూషణవర్మ (స్వతంత్ర అభ్యర్థి)
18.పిప్పళ్ల సుప్రజ (స్వతంత్ర అభ్యర్థి)
19.పేపకాయల రాజేంద్ర (శుభ) (స్వతంత్ర అభ్యర్థి)
20.బొడ్డు శ్రీనివాసరావు (స్వతంత్ర అభ్యర్థి)
21.బొమ్మనబోయిన విఎస్ఆర్ మూర్తి (స్వతంత్ర అభ్యర్థి)
22.బొమ్మిడి సన్నిరాజ్ (స్వతంత్ర అభ్యర్థి)
23.బండారు రామ్మోహన్‌రావు (స్వతంత్ర అభ్యర్థి)
24.భీమేశ్వరరావు చిక్కా (స్వతంత్ర అభ్యర్థి)
25.మాకే దేవిప్రసాద్ (స్వతంత్ర అభ్యర్థి)
26.మెర్ల శాస్త్రులు (స్వతంత్ర అభ్యర్థి)
27.మోకన అంబేద్కర్ (స్వతంత్ర అభ్యర్థి)
28.రాజపూడి (స్వతంత్ర అభ్యర్థి)
29.జెటి రామారావు (స్వతంత్ర అభ్యర్థి)
30.రేవులగడ్డ ముఖేష్‌బాబు (స్వతంత్ర అభ్యర్థి)
31.వానపల్లి శివగణేష్ (స్వతంత్ర అభ్యర్థి)
32.ఎం.శ్రీనివాసరావు (స్వతంత్ర అభ్యర్థి)
33.శ్రీనివాస్ విష్ణువర్ధుల (స్వతంత్ర అభ్యర్థి)
34.జివి.సుందర్ (స్వతంత్ర అభ్యర్థి)
35.హాసన్ షరీఫ్ (స్వతంత్ర అభ్యర్థి)

బర్డ్ ఫ్లూ పట్ల అపోహలు వద్దు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: బర్డ్ ఫ్లూ వైరస్ పట్ల ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పశుసంవర్ధక శాఖ పశుసంవర్ధక శాఖ డిఏహెచ్ఓ సిహెచ్ నరసింహులు అన్నారు. అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో గురువారం జిల్లాలోని అసిస్టెంట్ డైరెక్టర్‌లు, పశు వైద్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బర్డ్ ఫ్లూ వైరస్ పట్ల ప్రజల్లో అపోహాలు లేకుండా చైతన్య పరచాలన్నారు. లైఫ్ స్టాక్ సెన్సెస్ త్వరగా పూర్తి చేయాలని, మిగిలిన 373 గ్రామాలను పూర్తి చేయాలని ఆదేశించారు. గొర్రెలకు, మేకలకు టీకాలు పూర్తి చేయాలని అన్నారు.

మాట్లాడుతున్న పశుసంవర్ధక శాఖ డిఏహెచ్ఓ నరసింహులు

నేషనల్ హైవే నిర్వాసితులకు

పూర్తిస్థాయిలో నష్టపరిహారం

రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ

ప్రజాశక్తి-రంపచోడవరం

రంపచోడవరం డివిజన్లో నేషనల్ హైవే 516ఇలో భూములు, ఇండ్లు, చెట్లు వంటివి కోల్పోయిన బాధితులకు పరిశీలించి పూర్తిస్థాయిలో నష్టపరిహారం చెల్లించే విధంగా తగు చర్యలు చేపట్టడం జరుగుతుందని రంపచోడవరం సబ్ కలెక్టర్ కెఆర్.కల్పశ్రీ పేర్కొన్నారు. రంపచోడవరం, గంగవరం, అడ్డతీగల, రాజవొమ్మంగి మండలాల తహశీల్దార్లు, ఆర్ఐలు, విఆర్ఒలు, అటవీశాఖ, నేషనల్ హైవే అథారిటీ అధికారులు, సర్వేయర్లు, ఆర్ అండ్ బి ఇంజనీర్లతో గురువారం స్థానిక ఐటిడిఎ సమావేశ మందిరంలో సబ్ కలెక్టర్ కల్పశ్రీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతీయ రహదారి నిర్మాణం వల్ల రోడ్డుకిరువైపులా భూములు కోల్పోయిన వారికి ఎటువంటి నష్టం జరగకుండా తగు చర్యలు చేపట్టినట్టు చెప్పారు. రంపచోడవరం మండలం ఐ.పోలవరం నుండి రాజవొమ్మంగి మండలం వరకు రోడ్డుకు ఇరువైపులా నష్టపోయిన గృహాలు, చెట్లు, భూములకు నష్టపరిహారం చెల్లించేందుకు పెండింగ్‌లో ఉన్న కేసులపై నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. నష్టపరిహారం పెండింగ్‌లో ఉన్న వారికి ప్రాసెస్ చేయడానికి బాధితుల బ్యాంకు అకౌంట్ నెంబర్లు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్లు కె.సూర్యనారాయణ, సిహెచ్.శ్రీనివాసరావు, డిప్యూటీ తహశీల్దారు శ్రీధర్, నాలుగు మండలాల ఆర్ఐలు, వీఆర్వోలు, సర్వేయర్లు, నేషనల్ హైవే అథారటీ అధికారులు పాల్గొన్నారు.

ప్రజలకు సకాలంలో సేవలు అందించాలి

ఏజెన్సీలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం వివిధ రకాలైన రెవిన్యూ సేవలను ప్రజలకు సకాలంలో అందించాలని రంపచోడవరం సబ్ కలెక్టర్ కెఆర్.కల్పశ్రీ ఆదేశించారు. స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో ఏడు మండలాల తహశీల్దార్లు, ఆర్ఐలు, మండల సర్వేయర్లు, సచివాలయాల సర్వేయర్లు, వీఆర్ఓలతో రెవెన్యూ సేవలపై సబ్ కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏజెన్సీలో కుటుంబ యాజమాని పేరు మీద ఉన్న భూములు దరఖాస్తులు సమర్పించిన వెంటనే నిబంధనల ప్రకారం మ్యుటేషన్ చేయాలని ఆదేశించారు. రేషన్ లబ్ధిదారులకు సకాలంలో రేషన్ అందజేయాలన్నారు. తహశీల్దార్లు, వీఆర్వోలు ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయి పర్యటనలు చేయాలని, దానికి ఒక షెడ్యూల్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అర్హులైన వారికి వివిధ రకాల సర్టిఫికెట్లు మంజూరు చేయాలన్నారు. దేవీపట్నం మండలంలో ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ సంబంధించిన వివరాలు, నేషనల్ హైవేకు సంబంధించిన వివరాలు పూర్తిస్థాయిలో పరిశీలించి సమర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్లు పి.రామకృష్ణ, సిహెచ్.శ్రీనివాసరావు, కె.సత్యనారాయణ, వేణుగోపాల్, బాలాజీ, డివిజనల్ సివిల్ సప్లై అధికారి విజయ భాస్కర్, డిప్యూటీ సర్వే ఆఫ్ ఇన్స్పెక్టర్ లక్ష్మణరావు, ఈడీఎం నగేష్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ కల్పశ్రీ

ఉద్యోగులు, కార్మికుల గొంతు వినిపించేందుకు

పిడిఎఫ్ అభ్యర్థుల గెలుపు అవసరం

ఎపి ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోత రామారావు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

ఉద్యోగులు, కార్మికులు, ప్రజల గొంతు మండలిలో వినిపించేందుకు పిడిఎఫ్ అభ్యర్థుల గెలుపు ఎంతో అవసరమని ఎపి ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోత రామారావు అన్నారు. ఉభయ గోదావరి జిల్లా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థి దిడ్ల వీరరాఘవులును గెలిపించాలని కోరుతూ రాజవొమ్మంగిలో ఆదివాసీ గిరిజన సంఘం, ప్రజాసంఘాల నాయకులు ప్రచారం నిర్వహించారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, అధ్యాపక, కార్మిక, సామాజిక, ప్రజా సంఘాల బలపరిచిన పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి దిడ్ల వీరరాఘవులుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పట్టభద్రుల ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. చిరు ఉద్యోగులు, కార్మికులు పక్షాన నిలిచే పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాలన్నారు. ఉమ్మడి రాష్ట్రంలోనూ పిడిఎఫ్ అభ్యర్థులు కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై నిరంతరం పనిచేస్తూ, శాసనమండలిలో తమ గొంతు వినిపించినట్లు చెప్పారు. జిల్లాలో నెలకొన్న అనేక సమస్యల పట్ల స్పష్టమైన అవగాహన, పరిష్కారం మార్గాలను ప్రభుత్వాలకు సూచన చేయగల సామర్థ్యం ఉన్న పిడిఎఫ్ అభ్యర్థి వీర రాఘవులును గెలిపించి మండలికి పంపించాలని కోరారు. ఏపి కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్, సమగ్ర శిక్ష ఉద్యోగుల ఫెడరేషన్, నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగులు జెఏసి తరపున పిడిఎఫ్ అభ్యర్థులకు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలు సంఘాల నాయకులు కొండ్ల సూరిబాబు, కుంజం జగన్నాథం, పెయ్యల పాపారావు, కె ప్రవీణ్, కె అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

పిడిఎఫ్ అభ్యర్థి దిడ్ల వీరరాఘవులును గెలిపించాలని ప్రచారం చేస్తున్న ఎపి ఆదివాసీ గిరిజన సంఘం నేతలు

విధి నిర్వహణలో అలసత్వం వస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

విధి నిర్వహణలో విద్యుత్ శాఖ సిబ్బంది అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఏపీఈపీడీసీఎల్ ఎస్‌సి ప్రసాద్ హెచ్చరించారు. రాజవొమ్మంగి ట్రాన్స్‌కో కార్యాలయాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా సందర్శించి తనిఖీలు చేశారు. రికార్డులను పరిశీలించారు. సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. అనంతరం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రానున్న వేసవి నేపథ్యంలో రక్షిత మంచినీటి పథకాలకు ఎటువంటి ఇబ్బంది రాకుండా నిరంతర విద్యుత్ ఇచ్చేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో కొత్తగా 25 వేల గిరిజన కుటుంబాలకు విద్యుత్ కనెక్షన్‌లు ఇచ్చినట్లు తెలిపారు. ఇటీవల మండలంలో రాజవొమ్మంగిలో రైతు పొలానికి 12 విద్యుత్ పోల్స్ ఎటువంటి అనుమతులు లేకుండా అమర్చారని ఫిర్యాదు అందిన నేపథ్యంలో దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ డిఈఈ దివాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

సిబ్బందికి సూచనలు ఇస్తున్న ప్రసాద్

వినతిపత్రం ఇస్తున్న విజయ సాధన పాఠశాల హెచ్ఎం, విద్యార్థులు

కోతుల సమస్యను పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి-కూనవరం

మండల కేంద్రంలో కోతుల బెడద ఎక్కువగా ఉందని, దీని వల్ల గ్రామస్తులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని, కోతుల సమస్యను పరిష్కరించాలని స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో విజయ సాధన స్కూల్ యాజమాన్య ప్రతినిధులు గురువారం వినతి పత్రం అందజేశారు. గ్రామంలో కోతుల ఎక్కువగా ఉందని ఎంత మంది అధికారులకు చెప్పినా ఎవరు పట్టించుకోవటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రోజూ పిల్లలు పాఠశాలకు రావాలంటే భయపడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో విజయ సాధన హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏకలవ్య ప్రవేశ పరీక్ష తేదీ మార్పు

ప్రజాశక్తి-రంపచోడవరం : రంపచోడవరం, చింతూరు ఐటిడిఎ పరిధిలోని ఆరు ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో 2025-26 విద్యా సంవత్సరంలో ప్రవేశానికి నిర్వహించనున్న ప్రవేశ పరీక్ష తేదీని మార్పు చేసినట్లు గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎ.విజయశాంతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరు ఏకలవ్య పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియంలో సిబిఎస్ఇ సిలబస్‌లో 6వ తరగతిలో 360 సీట్లకు అడ్మిషన్లకు నోటిఫికేషన్ జారీ చేసినట్లు వెల్లడించారు. అర్హులైన గిరిజన విద్యార్థినీ విద్యార్థులు ఈ నెల 19లోగా ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 25వ తేదీన జరగాల్సిన ప్రవేశ పరీక్షను మార్చి 2వ తేదీకి మార్పు చేసినట్లుగా పేర్కొన్నారు. ఆన్లైన్ రిజిస్ట్రేషన్ కొరకు ఈ https://twreiscet.apcfss.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలు, సందేహాలు కోసం దగ్గరలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్సియల్ స్కూల్స్‌లో సంప్రదించాలని కోరారు.

ఉపాధి హామీ విఆర్‌పిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-కొయ్యూరు : అవకతవకలకు పాల్పడుతున్న కొయ్యూరు మండలం, మర్రివాడ పంచాయతీ, దొడ్డవరం ఉపాధి హామీ పథకం విఆర్‌పి జుర్రా సత్యనారాయణపై చర్యలు తీసుకోవాలని ఏపీవో, ఎంపీడీవోకు గ్రామ సర్పంచ్, ఉపాధి హామీ కూలీలు గురువారం వినతి పత్రం అందజేశారు. విఆర్‌పి సత్యనారాయణ విధి నిర్వహణలో అవకతవకలకు పాల్పడుతున్నారని, స్థానికంగా ఉండడం లేదని, పనులు అప్పగించడం లేదని, పనికి వెళ్ళని వారికి కూడా మస్తర్లు వేస్తున్నారని, ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాదల సత్యవతి, చిన్నారావు, టిడిపి నాయకులు భాస్కరరావు, నాగేంద్ర మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా అవినీతికి పాల్పడుతున్న వీఆర్పీని అధికారులు విధుల నుంచి తొలగిస్తారో లేదా కొమ్ము కాస్తారో వేచి చూస్తామని తెలిపారు. విధుల నుంచి తొలగించకుంటే పోరాటం చేస్తామని హెచ్చరించారు.



వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

ముస్లిం యువతి వివాహానికి చేయూత

ప్రజాశకి-అల్లూరి జిల్లా : చింతూరు మండల కేంద్రం బీసీ కాలనీలో నివాసముంటున్న షేక్ రహమతుల్లా కూతురు వివాహానికి జెకెసి ట్రస్ట్ చైర్మన్, ఆయుర్వేద వైద్యులు జమాల్ ఖాన్ లక్ష రూపాయల చెక్కును గురువారం అందజేశారు. పేద కుటుంబానికి నివాసం కూడా సరిగా లేనందున తానే స్వయంగా ఇంటి నిర్మాణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ కార్యదర్శి ఇమ్రాన్ ఖాన్ సభ్యులు నాదర్ ఖాన్. రసూల్, అజీజ్, బాబు, జావేద్, సుభాని తదితరులు పాల్గొన్నారు.

లక్ష రూపాయల చెక్కును అందజేస్తున్న జమాల్ ఖాన్

నినాదాలు చేస్తున్న గ్రామస్తులు, సిపిఎం నేతలు

పాఠశాల తరలింపుపై నిరసన

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: జీవో 117 అమలులో భాగంగా మండలంలోని లక్ష్మీపురం పంచాయతీ ఉబ్బెంగుల గ్రామంలో మండల ప్రజా పరిషత్ పాఠశాలలో 3,4,5వ తరగతుల విద్యార్థులను ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలకు తరలించడం సరికాదని లక్ష్మీపురం సిపిఎం సర్పంచ్ కొర్ర త్రినాథ్ తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులతో పాఠశాల ఆవరణంలో గురువారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రాథమిక పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న3,4,5 వ తరగతులను తరలింపు ఆలోచనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఆదివాసి గిరిజన పివిటిజి విద్యార్థుల కు స్థానికంగానే మెరుగైన విద్య అందించే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

గత వైసిపి ప్రభుత్వం తీసుకొచ్చిన జిఓ 117ను రద్దు చేస్తామనికూటమి ప్రభుత్వం ప్రకటన చేసి 10 మంది కన్నా తక్కువగా 3,4,5వ తరగతులు విద్యార్థులను తరలించడం సరికాదన్నారు. ఇదే అమలు జరిగితే గిరిజన ప్రాంతంలో విద్యా వ్యవస్థ సర్వనాశనం అవుతుందని, డ్రాప్ ఔట్ పెరిగే అవకాశం ఉందని తెలిపారు. ప్రభుత్వం స్పందించి విద్యార్థుల తరలింపు ఆలోచనను విరమించుకోవాలని, లేనిచో మండల విద్యా శాఖ కార్యాలయాల ముందు ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ వి.సాదురామ్, విద్యా కమిటీ చైర్మన్ వి.జీవన్, గ్రామస్థులు అనిల్ కుమార్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు,

తహశీల్దార్ నర్సమ్మకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

రేషన్ బియ్యం ఇవ్వాలని వినతి

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: మండలంలో బుంగా పుట్టు పంచాయతీ కేంద్రంలో ఏర్పాటు చేసిన డిఆర్ డిపో నుంచి గత ఏడు నెలలుగా కోటా బియ్యం సక్రమంగా అందలేదని ఆదివాసి గిరిజన, రైతు సంఘం నేతలు గురువారం తహసిల్దార్ నర్సమ్మకు వినతి పత్రాన్ని అందజేసారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం మండల అధ్యక్షుడు ఎంఎం శ్రీను మాట్లాడుతూ, గత ఏడు నెలలుగా సకాలంలో కోటా బియ్యం అందించలేదని ఆగ్రహించారు. ప్రతి నెలా రెండు, మూడు గ్రామాల రేషన్ లబ్ధిదారులకు బియ్యం,నిత్యావసర సరుకులు అందలేదని వివరించారు. ఈ విషయం పై గతంలో పత్రికల్లో కథనాలు వస్తే తూతు మంత్రంగా స్పందించిన అధికారులు చేతులు దులుపుకున్నారన్నారు. ఈ నెలకు సంబంధించి రేషన్ స్టాక్ పూర్తిగా రాలేదని, దీనిపై విచారణ జరిపి బాధ్యుల పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బుంగపుట్టు డియర్ డిపో రేషన్ లబ్ధిదారులతో తహసిల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పి.సత్యనారాయణ, ఎస్.గాసిరామ్‌దొర, ఎం.నర్సింగ్ పడాల్, సర్పంచ్ కొర్రా త్రినాథ్ పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన కల్పించండి

కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు: రహదారి ప్రమాదాల నివారణకు అన్ని వర్గాల వారికి అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ సూచించారు. గురువారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో జరిగిన రహదారి భద్రతా సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, రహదారిలో అవసరమైన స్పీడ్ బ్రేకర్స్ వేయాలని, సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ప్రమాదాల సమాచార నివేదికలను ఎప్పటికప్పుడు అందించి కేసులు పరిష్కార చర్యలు వెంటనే చేపట్టాలన్నారు. జాతీయ రహదారులు, ఆర్ అండ్ బి, వైద్య, రవాణా తదితర శాఖలు పరస్పర సహకార సమన్వయంతో పని చేయాలని సూచించారు. జాతీయ రహదారి పనులు జరుగున్నప్పటికీ తాత్కాలిక సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. కూడళ్ళలో హై మాస్ట్ లైట్లను ఏర్పాటు చేయాలన్నారు. రద్దీ ప్రదేశాలలో పార్కింగ్ ప్రాంతాలను గుర్తించి పార్కింగ్ సమస్య నివారించాలని, అనధికార ప్రాంతాలలో పార్కింగ్ చేసిన వారికి జరిమానాలు విధించాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రహదారి అంచులలో ఏపుగా పెరిగిన పొదలు, మొక్కలు తొలగించాలని ఆదేశించారు. ఫిబ్రవరి, మార్చి సీజన్లో రహదారి ప్రమాద మరణాలు తగ్గేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పి అమిత్ బర్దర్, ఎఎస్పి ధీరజ్, జిల్లా రవాణాదికారి లీలా ప్రసాద్, ఎమ్విఐ కే..వాసు, జిల్లా ప్రజా రవాణాదికారి ఉమా మహేశ్వర రావు, డిసిహెచ్ఎస్ కృష్ణా రావు, నరసింహరావు, ఆర్ అండ్ బి డి.ఇఇ, జాతీయ రహదారుల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

స్టెమితో గుండెకు భరోసా

ప్రజాశక్తి పాడేరు, : స్టెమి (ఎస్టి ఎలివేషన్ మయోకార్డియల్ ఇన్ఫార్షన్) తో గుండెకు భరోసా కలుగుతుందని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ స్పష్టం చేసారు. గురువారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో నిర్వహించిన రహదారి భద్రత సమావేశంలో భాగంగా స్టెమి పోస్టర్లను, టేనేక్ట్ ప్లేస్ ఇంజెక్షన్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, చాతి నొప్పి, భుజం లాగటం, ఆకస్మిక ఆయాసం, గుండె దడ, స్పృహ కోల్పోవడం వంటి సందర్భాలలో టేనేక్ట్ ప్లేస్ ఇంజెక్షన్ చేయించుకుంటే ఆకస్మిక మరణానికి దూరం కావచ్చని తదుపరి చికిత్సకు సమయం దొరుకుతుందని వివరించారు. అత్యవసర సమయంలో రోగులకు ఈ ఇంజెక్షన్ వేసి ప్రాణాపాయం నుండి ఉపశమనం కలిగించడం జరుగుతుందన్నారు. ఈ ఇంజెక్షన్ అన్ని సెకండరి ఆసుపత్రులైన మెడికల్ కళాశాల, జి.జీ.హెచ్ లతో పాటు సి.హెచ్.సిలు, ఏరియా ఆసుపత్రులలో అందుబాటులో ఉందన్నారు. సుమారు 45 వేల రూపాయలు విలువ చేసే ఈ ఇంజెక్షన్ ఆయా ఆసుపత్రులలో ఉచితంగా అందించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పి అమిత్ బర్దర్, ఎఎస్పి ధీరజ్, జిల్లా రవాణాదికారి లీలా ప్రసాద్, జిల్లా ప్రజా రవాణాదికారి ఉమా మహేశ్వర రావు, డిసిహెచ్ఎస్ కృష్ణారావు, . నరసింహరావు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక ఏర్పాట్లు పూర్తి

- 27న పోలింగ్
- 123 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు
- రిటర్నింగ్ అధికారి ఎంఎన్.హరేంధిరప్రసాద్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ

ఉత్తరాంధ్రలోని జిల్లాలకు ఫిబ్రవరి 27న నిర్వహించనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని రిటర్నింగ్ అధికారి, విశాఖపట్నం జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిరప్రసాద్ తెలిపారు. విశాఖ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఫిబ్రవరి 3న నోటిఫికేషన్ విడుదల చేశామని, అదే రోజు నుంచి నామినేషన్లను స్వీకరించినట్లు తెలిపారు. 10వ తేదీ నాటికి నామినేషన్ల స్వీకరణ పూర్తయిందని, మొత్తం 10 మంది అభ్యర్థుల నుంచి 20 నామినేషన్లు స్వీకరించినట్లు చెప్పారు. పరిశీలన అనంతరం నాలుగు నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయని తెలిపారు. నామినేషన్ల ఉపసంహరణ అనంతరం పదిమంది అభ్యర్థులు బరిలో ఉన్నారని, ఎవరూ నామినేషన్‌ను వెనక్కి తీసుకోలేదని వెల్లడించారు.

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ఈ నెల 27వ తేదీ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆరు జిల్లాల్లో 123 పోలింగ్ కేంద్రాలలో ఎన్నికలు నిర్వహించేందుకు అన్ని మౌలిక సదుపాయాలు, సిసి కెమెరాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈ ఎన్నికలలో 22,493 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. పురుష ఓటర్లు 13,508, మహిళా ఓటర్లు 8,985 మంది ఉన్నారని పేర్కొన్నారు. విశాఖపట్టణంలో 13, అనకాపల్లిలో 24, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 11, విజయనగరంలో 29, పార్వతీపురం మన్యంలో 15, శ్రీకాకుళంలో 31 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని వివరించారు.

ప్రతి పోలింగ్ కేంద్రంలో నలుగురు సిబ్బంది ఉంటారని, వారికి ఇప్పటికే రెండు రౌండ్ల శిక్షణ అందించినట్లు తెలిపారు. ఓటు వేసే అభ్యర్థులకు ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం స్లిప్పులు అందజేస్తామని, పోలింగ్ కేంద్రంలో గుర్తింపు కార్డును చూపించి స్లిప్పులు పొందాలని సూచించారు. పోలింగ్‌కు 48 గంటల ముందు అనగా ఫిబ్రవరి 25 సాయంత్రం నాలుగు గంటల నుంచి ఎటువంటి ప్రచారం చేయరాదని తెలిపారు. మార్చి 3వ తేదీన ఉదయం 8 గంటల నుంచి కౌటింగ్ ప్రారంభమవుతుందని చెప్పారు. ఆంధ్ర యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల ఈఈఈ బ్లాక్‌లో కౌంటింగ్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయనున్నామని, దీనికి ఎన్నికల కమిషన్ అనుమతి రావాల్సి ఉందని పేర్కొన్నారు. మార్చి 8వ తేదీతో ఎన్నికల ప్రక్రియ ముగుస్తుందని చెప్పారు. జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి పటిష్ట అమలుకు చర్యలు తీసుకున్నామని, వివిధ స్థాయి అధికారులతో కూడిన 12 ఎంసిపి బృందాలను నియమించామని, మండలానికి ఒకటి చొప్పున 11 ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశామని చెప్పారు.

రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

ప్రజాశక్తి -డంబ్రిగుడ: రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అమలు కావాలంటే పట్టా కలిగిన ప్రతి ఒక్క రైతు ప్రభుత్వం ప్రవేశపెట్టిన అగ్రీ స్టాక్ పోర్టల్‌లో తమ పేర్లను నమోదు చేసుకొని ప్రత్యేక గుర్తింపు నెంబర్ ను పొందాలని స్థానిక మండల వ్యవసాయ శాఖ అధికారిణి నీలవేణి చెప్పారు.మండల కేంద్రంలోని రైతు సేవా కేంద్రంలో రైతులకు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, నమోదు చేసుకొనే వారు తమ భూమి పట్టా పాస్ పుస్తకం, వన్ బితో పాటు ఆధార్ కార్డుతో లింక్ అయిన ఫోన్‌ను తెచ్చుకోవాలన్నారు.ఈ ప్రత్యేక గుర్తింపు పొందిన రైతులకు ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వర్తిస్తాయన్నారు.ఈనెల 25 లోగా ప్రతి ఒక్క రైతు నమోదు చేసుకోవాలని ఆమె కోరారు. ఈ సమావేశంలో ఆ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఏకలవ్య మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష వాయిదా

ప్రజాశక్తి-పాడేరుటౌన్: ఏకలవ్య మోడల్ గురుకుల విద్యాలయాల్లో 6వ తరగతి సీట్ల భర్తీ కోసం ఈనెల 25న నిర్వహించాల్సిన ప్రవేశ పరీక్షను అనివార్య కారణాల వల్ల వాయిదా వేశామని టిడబ్ల్యూ డిడి ఎల్.రజని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రవేశ పరీక్షను మార్చి 2న ఉదయం 11:30 గంటల నుంచి 1:30 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రవేశ పరీక్ష తేదీ మార్పును విద్యార్థులు వారి తల్లిదండ్రులు గమనించాలని కోరారు. మరిన్ని వివరాలకు సమీపంలోని గురుకుల విద్యాలయానికి, ఐటిడిఎ గురుకులం సెల్ 9493758072, 9908595435 ఫోన్ నెంబర్లకు సంప్రదించాలని పేర్కొన్నారు.

కాఫీ, మిరియాలు కోస్తూ జారిపడి ఇద్దరికి తీవ్రగాయాలు

- బాధితులకు సిపిఎం నేతల పరామర్శ

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: మండలంలోని చినలబుడు పంచాయితి హాట్టగూడ గ్రామానికి చెందిన గొల్లోరి సావిత్రి, డుంబ్రిగూడ మండలం అరమ గ్రామానికి చెందిన కొర్ర లైకొన్ కాఫీ, మిరియాలు సేకరిస్తుండగా ప్రమాదవశాత్తు జారీ తీవ్ర గాయాలై అరకు ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కిండంగి రామారావు గురువారం అరకు ఏరియా ఆసుపత్రిలో పర్యటించి చికిత్స పొందుతున్న వారిని జరిగిన సంఘటనపై అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కిండంగి రామారావుపరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజిహెచ్ తరలించినట్లు తెలిపారు.తలకు తగిలిన గాయానికి ఆపరేషన్ చేయవలసి ఉంటుందని వైద్యులు చెప్పడంతో నిరుపేదైన లైకోన్ తండ్రి గుండు ఆందోళన చెందుతున్నారని అధికారులు మెరుగైన చికిత్స కోసం కృషి చేయాలని కోరారు.
అరకువేలి హట్టగుడ గ్రామానికి చెందిన గొల్లోరి సావిత్రి మిరియాలు సేకరించడానికి వెళ్లి చెట్టు నుండి కిందకి పడటంతో వెన్నుపూస కు బలమైన దెబ్బ తగిలి అరకు ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతుందని తెలిపారు. మెరుగైన వైద్యం అందించాలని కోరారు.రైతులకు ఇన్సూరెన్స్ సదుపాయం కల్పించి ఆర్థికంగా ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

హెల్మెట్‌ధారణపై అవగాహన

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: ద్విచక్రవాహనం నడిపే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని డీఎస్పీ షేక్ షాహబాజ్ అహ్మద్ తెలిపారు. గురువారం అరకులోయ పోలీసు స్టేషన్ నుండి తహసిల్దార్ కార్యాలయం వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఎస్పీ ర్యాలీని ప్రారంభించారు. ద్విచక్రవాహనదారులు,వాహనం వెనుక కూర్చొన్న వారు ఖచ్చితంగా హెల్మెట్ ధరించాలని సూచించారు.హెల్మెట్ ధరించకపోవడంతో తలకు ఎక్కువగా గాయాలై రోడ్డు ప్రమాదాలలో చని పోతున్నారన్నారు. సెల్ ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడంతో జరిగే నష్టాలను తెలిపారు. మండల కేంద్రంలోని తరచుగా వాహనాలు తనిఖీ చేయడం జరుగుతుందని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ గోపాలరావు పాలోన్నారు.

అర్ధరాత్రి వేళలో స్టే చేసినట్లు ఫోటోలు అప్లోడ్ చేయమనడం భావ్యం కాదు : యుటిఎఫ్

ప్రజాశక్తి -పాడేరు: కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్‌లో డిప్యూటీ వార్డెన్స్, నైట్ హాల్ట్ ఉండే ఉపాధ్యాయినులు రాత్రి 11గంటల నుంచి 12 గంటల మధ్య స్టే చేసినట్లు జిపిఎస్ యాప్ ద్వారా ఒక ఫోటో, ఉదయం 5 గంటలకి ఫోటో తీయమనడం భావ్యం కాదని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు వి.మహేష్. ఖండించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఈ విధానాన్ని ఉపసంహరించుకోవాలని అధికారులను కోరారు ఉపాధ్యాయులపై అనవసరమైన ఒత్తిళ్లు గురి చేయడంతో మానసిక క్షోభకు గురి చేస్తుందన్నారు

నిర్వాసితులకు అన్యాయం చేస్తే ఊరుకోం

బహిరంగ సభలో పాల్గొన్న నాయకులు.

ప్రజాశక్తి -సీలేరు : అల్లూరు జిల్లాలో ప్రాజెక్టులు నిర్మాణం వల్ల నిర్వాసితులుగా మారుతున్న వారికి అన్యాయం చేస్తే చూస్తూ ఊరుకోమని దండకారణ్య ఉద్యోగ సమితి కేంద్ర కమిటీ సభ్యుడు సమిరెడ్డి మాణిక్యం హెచ్చరించారు. జీకే వీధి మండలం సీలేరు పంచాయతీ పరిధి చింతపల్లి క్యాంపులో సీలేరు ఏపీ జెన్కో ఉద్యోగ సమితి నాయకులు మనోజ్ కుమార్ ఆధ్వర్యాన గురువారం భారీ బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మాణిక్యం మాట్లాడుతూ ప్రాజెక్టు నిర్మాణానికి ఆదివాసీను వ్యతిరేకం కాదని ప్రాజెక్టు నిర్మాణం వల్ల నిర్వాసితులైన వారికి ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. సీలేరులో నెలకొల్పుతున్న పంపుడ్ స్టోరేజీ ప్రాజెక్టు నిర్మాణం వలన నష్టపోతున్న గిరిజనులకు ప్రభుత్వ నిబంధనలను ప్రకారం ఏపీ జెన్కో ఆదుకోవాలని, లేకుంటే పోరాటం చేస్తామని హెచ్చరించారు. సీలేరు పరిసర ప్రాంతాలలో ఏపీ జెన్కో 99 సంవత్సరాలు భూమి లీజు అగ్రిమెంట్లో ఏమి ఉందో శ్వేతపత్రం విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో సమితి నాయకులు కూడా ఆనంద్, సుబ్రమణ్యం, మార్క్ రాజు, మల్లేశ్వరరావు, గిరిజనులు పాల్గొన్నారు.

అవినీతి ఒక చోట.. తనిఖీలు మరోచోట

- ఎన్ఆర్ఇజిఎస్ అధికారుల తీరుపై కూలీల మండిపాటు

ప్రజాశక్తి-కొయ్యూరు : ఎన్ఆర్ఇజిఎస్ పనుల్లో అవినీతి ఒకచోట జరిగితే అధికారుల పర్యవేక్షణ మరోచోట చేయడంపై ప్రజాప్రతినిధులు, కూలీలు మండిపడుతున్నారు. మండలంలో ఉపాధి హామీ పనులను తనిఖీ చేసిన ఎపిడి లాలం సీతయ్య, అవినీతి జరిగిందని ఫిర్యాదులు చేసిన గ్రామాలను సందర్శించకపోవడంపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని దొడ్డవరం, చీడిపాలెం, పంచాయతీలలో ఎన్ఆర్ఈజీఎస్ పనులలో అవినీతి జరిగిందని, విఆర్‌పిలు అవినీతికి పాల్పడ్డారని సంబంధిత పంచాయతీల సర్పంచులు, పలువురు ఎన్ఆర్ఈజీఎస్ కూలీలు సంబంధిత ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసి నెలరోజులైనా ఉన్నతాధికారులు దర్యాప్తు చేయకపోగా, బుధవారం ఎన్ఆర్ఈజీఎస్ పనులను సందర్శించిన ఏపీడి సీతయ్య తూతూ మంత్రంగా సందర్శించడం శోచనీయమని వారు పేర్కొన్నారు. మండలంలోని కొండగోకిరి, నల్లగొండ, నడింపాలెం పంచాయతీలలో నామమాత్రపు తనిఖీలు నిర్వహించి వెళ్లిపోవడంపై పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-అల్లూరి జిల్లా : చింతూరు మండలంలోని సర్వేల గ్రామానికి చెందిన చిలకం దిలీప్ మృతి చెందగా, ఆయన కుటుంబానికి జమాల్‌ఖాన్ ఛారిటబుల్ ట్రస్టు తరుపున రూ.3వేలు ఆర్థిక సాయం అందించారు. దిలీప్ మృతితో ఆ కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని గ్రామస్తులు ప్రముఖ ఆయుర్వేద వైద్యులు, ట్రస్ట్ చైర్మన్ మహమ్మద్ జమాల్ ఖాన్ దృష్టికి తీసుకెళ్లారు. దీనికి ఆయన వెంటనే స్పందించి గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబానికి రూ.3000 గురువారం అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు చిలకమ్మ, కన్నయ్య, సుబ్బారావు, మడక వెంకటేశ్వరరావు, జెకె సిటీ ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

ఇపిఎఫ్ పెన్షనర్ల సంఘీభావ ర్యాలీ

ప్రజాశక్తి-తగరపువలస : ఢిల్లీలో పెన్షనర్ల ఆందోళనకు మద్దతుగా స్థానికంగా ఉన్న పలువురు పెన్షనర్లు గురువారం ర్యాలీ నిర్వహించారు. చిట్టివలస ప్రాంత ఇపిఎఫ్ పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో చిట్టివలస ఫుట్‌బాల్ గ్రౌండ్ నుంచి ప్రధాన రహదారి గుండా జంక్షన్ వరకు ర్యాలీ సాగింది.సంఘం అధ్యక్షులు కానూరు రాంబాబు, ప్రధాన కార్యదర్శి దామోదర బాబాజీ, కోశాధికారి పంపాన సూర్య నారాయణ సహాయ కార్యదర్శి మోర అప్పలరాజు, సిహెచ్ అప్పారావు, జీరు సత్యారావు పాల్గొన్నారు

పీసా చట్టంపై అవగాహన పెంచుకోవాలి

ప్రజాశక్తి-మారేడుమిల్లి : షెడ్యూల్ ఏరియాలో ఉన్న గిరిజనులు, గిరిజనేతరులు పీసా చట్టంపై అవగాహన కలిగి ఉండాలని ఎంపిడిఓ తూతిక శ్రీనివాస విశ్వనాథ్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచులు, వార్డు సభ్యులు, పీసా కమిటీ సభ్యులు, స్వయం సహాయక సంఘాల సభ్యులకు పీసా చట్టంపై నాలుగు రోజుల పాటు జరుగు శిక్షణ తరగతులను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షెడ్యూల్ ప్రాంతంలో గిరిజనులు సొంత ఆలోచనలతో స్వయం పరిపాలన చేసుకోవడానికి పీసా చట్టం దోహదపడుతుందని తెలిపారు. విద్య, వైద్యం, ఉపాధి, తాగునీరు, అభివృద్ధి తదితర అంశాలలో పీసా గ్రామసభలు ద్వారా స్వయం నిర్ణయాలు తీసుకొని అభివృద్ధి ప్రణాళికలు తయారు చేసి అమలు చేయవచ్చని చెప్పారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి చైతన్య, ఎంపీపీ లలిత కుమారి, జడ్పీటీసీ గొర్లే బాలాజీ బాబు, పరిపాలన అధికారి రత్నకుమారి, సీనియర్ సహాయకులు ఆనంద్ పాల్గొన్నారు.

అల్లూరి జిల్లా : మండలంలో ఎన్నికైన పీసా కమిటీ ఉపాధ్యక్షులు, కార్యదర్శులు, వార్డ్ సభ్యులు, సర్పంచులు, ఎంపీటీసీలు, స్వయం సహాయక సభ్యులకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం శిక్షణ నిర్వహించారు. ఎంపిడిఓ పిజి రామకృష్ణ, ఎంపీపీ సవలం అమల, సామర్లకోట ఫ్యాకల్టీ ఆంజనే యులు, కోడేరు సర్పంచి సుబ్బలక్ష్మి, ఎంపిటిసి జల్లి లావణ్య, చదలవాడ సర్పంచ్ కుంజా తిరుపతిరావు పాల్గొన్నారు.

రంపచోడవరం : మండల పరిషత్ కార్యాలయం, ఎంఆర్‌సి భవనంలో గురువారం జరిగిన పీసా కమిటీలకు శిక్షణ తరగతులు నిర్వహించారు. తొలి రోజు మొత్తం 189 మంది సభ్యులకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ సుండం శ్రీనివాసుదొర, పిఆర్ అండ్ పిడి ఇఇ పద్మజ, పంచాయతీ సెక్రటరీలు ఎం.మహేశ్వరరావు, ఎస్‌కె బాషా, లక్ష్మి, కె.శాంతి, ప్రసన్న, పరిశీలకులు పి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

విఆర్.పురం : స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో విఆర్.పురం మండలంలోని పీసా కమిటీ సభ్యులకు గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్చార్జి ఎంపిడిఓ రామాంజనేయులు, జెడ్పీటీసీ రంగారెడ్డి, ఎంపిపి కారం లక్ష్మి, సర్పంచ్‌లు, పీసా కమిటీ ఉపాధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

మారేడుమిల్లిలో శిక్షణలో పాల్గొన్న పెసా కమిటీ, వార్డు సభ్యులు

డుంబ్రిగుడ: గ్రామాభివృద్ధికి పీసా కమిటీ సహకరించాలని ఎంపీడీఓ ప్రేమ్‌సాగర్ స్పష్టం చేశారు. మండల పరిషత్తు కార్యాలయ సమావేశ మందిరంలో పెసా, గ్రామైఖ్య, ప్రజా ప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శుల శిక్షణ కార్యక్రమం గురువారం ప్రారంభించారు. గ్రామైఖ సంఘాల శిక్షణలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో గ్రామాల అభివృద్ధికి చర్యలు చేపడుతున్నారని చెప్పారు. దీనిలో భాగంగానే గ్రామాల అభివృద్ధికి ప్రణాళికను రూపొందించేందుకు శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నామన్నారు. ఈనెల 25వరకు దశల వారిగా శిక్షణ ఉంటుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

చింతూరులో పీసా కమిటీ సభ్యులకు శిక్షణ

రంపచోడవరంలో మాట్లాడుతున్న ఎంపిడిఓ

విఆర్.పురంలో శిక్షణలో మాట్లాడుతున్న ఎంపిడిఓ

విజయగౌరి విజయానికి విస్తృత ప్రచారం

శ్రీకాకుళం జిల్లా కొత్తూరులో ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న విజయగౌరి

ప్రజాశక్తి - ములగాడ : ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో యుటిఎఫ్ బలపరిచిన పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరిని గెలిపించాలని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ కోరారు. గురువారం సింధియా, మల్కాపురం, శ్రీహరిపురం ప్రాంతాల్లో కేంద్రీయ విద్యాలయ, ప్రభుత్వ, జివిఎంసి పాఠశాలలతోపాటు సరస్వతి విద్యావిహార్, లక్కీఅమర్, దివాకర్ వంటి ప్రయివేటు విద్యాసంస్థల్లో విస్తృతంగా ప్రచారం చేశారు విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ పోరాట కమిటీ జెఎసి చైర్మన్ ఎం.జగ్గునాయుడు, సిఐటియు మల్కాపురం జోన్ నాయకులు ఆర్ లక్ష్మణమూర్తి, పి.పైడిరాజు కె.పెంటారావు, ఎ.సత్యారావు పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు కె.నూకరాజు, ఆర్.దేవరాజు పాల్గొన్నారు.

మధురవాడ : విద్య, ఉపాధ్యాయ సమస్యలపై పాలక ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్న నేపథ్యంలో ప్రశ్నించి,పోరాడే సత్తా, ప్రగతిశీల శక్తిగల పిడిఎఫ్ తరపున ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానంలో పోటీలో ఉన్న కోరెడ్ల విజయగౌరికి ప్రథమ ప్రాధాన్యత ఓటేసిగెలిపించాలని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ కోరారు. గురువారం విజయ గౌరి విజయాన్ని కాంక్షిస్తూ మధురవాడ, కొమ్మాది,ప్రాంతాలలో చైతన్య జూనియర్ కళాశాల, ఎపి గిరిజన సంక్షేమ ప్రతిభా బాలికల విద్యాలయం, మాలతంబ విద్యానికేతన్ తదితర విద్యాసంస్థలలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలోఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రజాసంఘాల నాయకులు ఆర్‌కెఎస్‌వి కుమార్, కెఎం కుమారమంగళం, రఘుపతి వెంకటరమణ, డి అప్పలరాజు, బి భారతి, డి.కొండమ్మ పాల్గొన్నారు.

గాజువాక : ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పిడిఎఫ్ అభ్యర్థి విజయగౌరి విజయాన్ని కాంక్షిస్తూ గురువారం యుటిఎఫ్ ఆధ్వర్యంలో గాజువాకలో పలు పాఠశాలల్లో విస్తృత ఎన్నికలప్రచారం నిర్వహించారు. ఎన్నికల ప్రచారంలో యుటిఎఫ్ విశాఖపట్నం జిల్లా ప్రధాన కార్యదర్శి అంబేద్కర్, రాష్ట్ర నాయకులు అప్పారావు, సహాయ కార్యదర్శి రిజ్వాన్, ఎస్‌పి రాజు, ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ నాయకులు పి లక్ష్మిస్వామి, జనవిజ్ఞాన వేదిక నాయకులు డాక్టర్ రమేష్ కుమార్, ఐద్వానేత కె.సంతోషం,

ఉపాధ్యాయ సమస్యలపై పోరాటం : విజయగౌరి

కొత్తూరు(శ్రీకాకుళం జిల్లా): విద్యారంగ పరిరక్షణకు, ఉపాధ్యాయులు, అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి శాసనమండలిలో పోరాడతానని పిడిఎఫ్ ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి అన్నారు. కొత్తూరు, హిరమండలం, ఎల్.ఎన్ పేట మండలాల్లో పలు ప్రభుత్వ పాఠశాలలు, కెజిబివిలు, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో గురువారం ఎన్నికల ప్రచారం చేశారు. ఈనెల 27న నిర్వహించనున్న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను తొలి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఉపాధ్యాయులు, అధ్యాపకులకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ దండు ప్రకాశరావు, జిల్లా కార్యదర్శి బి.శ్రీనివాసరావు, జి.శ్రీరామచంద్రమూర్తి, మహిళా నాయకులు డి.స్వర్ణలత, ఆర్.జ్యోతి, ఎన్.లలిత కుమారిపాల్గొన్నారు.

మానవ మేధస్సుకు కృత్రిమ మేధ ప్రత్యామ్నాయం కాదు

గీతం హెచ్‌ఆర్ కాన్‌క్లేవ్‌లో నిపుణులు

ప్రజాశక్తి -మధురవాడ : మానవ మేధస్సుకు కృత్రిమ మేధ ప్రత్యామ్నాయం కాదని, ముఖ్యంగా జీవ శాస్త్రాలను అభ్యసించే విద్యార్థులు లోతైన విషయ పరిజ్ఞానంతో, పరిశోధన దృష్టితో అవకాశాలను అందుకోవాలని మానవ వనరుల నిపుణులు సూచించారు. గీతం కెరీర్ గైడెన్స్ సెంటర్ ఆధ్వర్యంలో ఔషధ, జీవ శాస్త్ర పరిశ్రమలలో విద్యార్థులకు ఉద్యోగావకాశాలు నైపుణ్యాలు అనే అంశంపై గురువారం నిర్వహించిన హెచ్‌ఆర్ కాన్‌క్లేవ్‌లో పరిశ్రమల నిపుణులు పాల్గొని, దిశానిర్దేశం చేశారు.

గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ కెఎస్.కృష్ణ మాట్లాడుతూ జీవశాస్త్రంలో పరిశోధనలకు అవధుల్లేవని, తమ చుట్టూ ఉండే ప్రకృతి నుంచి ప్రతి అంశాన్నీ పరిశోధనకు ఎంచుకోవచ్చన్నారు. లీ ఫార్మా లిమిటెడ్ డైరక్టర్ లీలా రాణి మాట్లాడుతూ ఫార్మా రంగంలో ఎదగాలనుకునేవారు సెడ్యూల్-ఎమ్ గురించి తెలుసుకుని, బహుముఖ ప్రజ్ఞతో ఉండాలన్నారు. గోద్రేజ్ ఆగ్రోవెట్ సంస్థ హెచ్‌ఆర్ హెడ్ బట్టి శేఖర్ మాట్లాడుతూ, కార్పొరేట్ రంగంలో సమర్థతకు పెద్దపీట వేస్తామని,ప్రాంగణ నియామకాలలో విద్యార్థుల వడపోతకు కృత్రిమ మేధ సహాయం తీసుకుంటామన్నారు. సన్‌విరా బయోసైన్సెస్ సంస్థ ఛీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ శివబాలన్ కన్నన్ మాట్లాడుతూ పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యార్థులు శిక్షణ పొందాలన్నారు. గ్లాండ్ ఫార్మా సంస్థ క్రొమటోగ్రఫిక్ నిపుణుడు చైతన్య గోగులపతి మాట్లాడుతూ ఔషధాల తయారీ, డిజైనింగ్, క్వాలిటీ, ఎనలిటిక్స్ వంటి అంశాలలో కృత్రిమ మేధ వినియోగం పెరుగుతోందని, దానికి తగ్గ నిపుణుల అవసరం ఉందన్నారు. గీతం ఇన్నోవేషన్ అధికారి ఎన్.క్రిష్ మాట్లాడుతూ గీతంలో పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా సిలబస్ మార్పు చేయడానికి పారిశ్రామిక నిపుణులతో సలహా సంఘం నియమించామన్నారు. గీతం స్కూల్ ఫార్మశీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎల్.శ్రీనివాస్, స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.వేదవతి, జిసిజిసి అధిపతి ప్రొఫెసర్ ఉమాదేవి, టెక్ మహింద్ర సంస్థ నిపుణుడు సాంకేత్‌కుమార్ పాత్ర, సెర్టిగో సంస్థ సిఇఒ డాక్టర్ బి.షీలా, క్లినోసోల్ రీసెర్చి వ్యవస్థాపకుడు మూజీబుద్దీన్ షేక్, సేఫ్‌విగ్ సొల్యూషన్ సంస్థ సహ వ్యవస్థాపకరాలు పి.శ్రీదివ్య పాల్గొని మాట్లాడారు.